క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ నిర్మాణ కమిటీకి నగదు అందజేస్తున్న దాత శ్రీనివాసరావు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన సతివాడ శ్రీనివాసరావు రూ.1,00,116 విరాళం ఇచ్చారు. సోమవారం ఆయన నివాసం వద్ద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దాసరి రవి, అప్పికొండ ఆదిబాబుకు నగదును అందజేశారు.

నియామకపత్రం అందజేత



అంగన్‌వాడీ హెల్పర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఐసీడీఎస్ పీఓ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: కర్లాం పంచాయతీ పరిధి మోదుగులపేట అంగన్‌వాడీ కేంద్రానికి ఆయాగా నియమితులైన అగురు మణికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు సోమవారం నియామకపత్రం అందజేశారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కర్లాం వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణాన శ్రీనివాసరావు, కరిమజ్జి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



చెరువు గర్భాన్ని చదును చేసే పనులను అడ్డుకున్న వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది

గుర్ల: ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పద్మావతి హెచ్చరించారు. మండ లంలోని దేవునికణపాక రెవెన్యూలో సర్వే నంబర్ 105–1లో ఉన్న చెరువు గర్భాన్ని కొంత మంది జేసీబీలతో చదును చేయిస్తున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. సోమవారం రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పంపించి పనులను అడ్డుకున్నామని చెప్పారు. చెరువు గర్భాన్ని సర్వే చేయించి ఆక్రమణలు రుజువైతే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గ్రావెల్ రోడ్డు పనుల పరిశీలన



వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ తివిక్రమ్

మెంటాడ: మండలంలోని గిరిజన గ్రామాలు కొండజీరికవలస– బైలుగుడ్డి మధ్య ఉపాధి హామీ పథకం భాగంగా చేపడుతున్న గ్రావెల్ రోడ్డు పనులను ఎంపీడీఓ తివిక్రమ్ సోమవారం పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు చేపడుతున్నదీ లేనీ పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న రవికుమార్, తదితరులు

లక్కవరపుకోట: మండలంలోని సీతారామపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్.ఎస్.ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు,పెన్సిళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఎస్.ఎస్.ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎన్.రవికుమార్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయిస్తామని, మొక్కల పెంపకం చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామపెద్దలు సోమేశ్వరరావు, గొర్లె శ్రీరాములు, అప్పారావు, హెచ్ఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా గడప గడపకూ సంక్షేమం



పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అన్నారు. గరివిడి మండలంలోని బొండపల్లి గ్రామం లో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, నాయకులు మాట్లాడుతూ ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆలోచన అని అన్నారు. ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ తన మూడున్నరేళ్ల పాలనలోనే 98 శాతం పూర్తి చేశారని చెప్పారు. పేదలకు మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. సీఎం జగన్ అవినీతి రహిత, ఆదర్శపాలన అందిస్తున్నారని, గత టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలని ప్రజలకు సూచించారు. స్థానిక సర్పంచ్ సాకేటి స్వప్న, ఎంపీటీసీ రాములప్పమ్మ, ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, శంబాం పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, ఎంపీటీసీ పోలీసు నాయుడు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది,వలంటీర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



సర్టిఫికెట్లు, పతకాలతో విద్యార్థినులు

జామి: దశమందం విద్యాసేవాసదన్ కడప జిల్లా ప్రొద్దుటూరు వారి ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి దశమందం హిందీ ప్రతిభ పరీక్షలో మండలంలోని కుమరాం కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. కేజీబీవీ ఎస్ఓ బి.జ్యోతి సోమవారం మాట్లాడుతూ దశమందం విద్యాసేవాసదన్ నిర్వహించిన హిందీ ప్రతిభ పరీక్ష ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయని చెప్పారు. పాఠశాల విద్యార్థినులు పి.ప్రసన్న బంగారు పతకం, సీహెచ్.పూర్ణిమ, జి.శ్యామల, పి.భువన, ఎస్.రమ్య రజత పతకాలు, పి.మోనిక కాంస్య పతకం సాధించారని తెలిపారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయినులు అభినందించారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, మందుల నిల్వలు, తదితర అంశాలతో పాటు సమస్యలపై వైద్యాధికారి అనిల్ కుమార్‌ను ఎంపీపీ ఆరా తీశారు. ఆస్పత్రికి ఇన్వర్టర్ సమకూర్చాలని వైద్యాధికారి కోరగా..ఇన్వర్టర్ కొనుగోలుకు పంచాయతీ నిధులు మంజూరు చేయించారు. ఆస్పత్రిలో మరుగుదొడ్ల ఆధునికీకరణ, ఆస్పత్రి ఆవరణ చదును చేయించడం, అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎంపీడీఓ జి.భాస్కరరావు, తహసీల్దార్ టి.గోవింద్, సర్పంచు సాకేటి స్వప్న, ఎంపీటీసీ రాములప్పమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, మాజీ ఎంపీటీసీలు రెడ్డి, బోడియ్య పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ



మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు తదితరులు

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి వద్ద ఉపాధి హామీ పథకం నిధులతో వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మునగ నర్సరీలో డ్వాక్రా సంఘాల సభ్యులకు అధికారులు, సర్పంచ్ నౌడు అరుణతో కలిసి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు 6,200 మునగ మొక్కలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగ మొక్కల సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. పెరటిలో, కల్లాల వద్ద, పొలం గట్లపై మునగ మొక్కలు సాగు చేయడం వల్ల రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. మునగ ఆకు, కాడలు వినియోగంతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మునగలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ నర్సరీలో రూ.47 వేల ఉపాధి హామీ నిధులతో పదివేల మునగ విత్తనాలు నాటగా, 8,100 మొక్కలు పెరిగినట్లు చెప్పారు. నర్సరీ నిర్వాహకుడు దొగ్గ గంగునాయుడును అభినందించారు. తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, గ్రామపెద్దలు నౌడు శ్రీను, పైడునాయుడు ఉపాధి ఈసీ దేముడునాయుడు, టీఏలు,వీఓఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

గంట్యాడ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ(ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. పౌష్టికాహారం ఆవశ్యకత, జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత తదితర అంశాలపై మండలంలోని లక్కిడాం ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికల్లో రక్తహీనత సమస్య తలెత్తకుండా ఉండేందుకు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే సచివాలయ మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బందికి, లేదా చైల్డ్ లైన్ సమాచారం అందించాలని చెప్పారు. హెచ్ఎం వాక చిన్నంనాయుడు, ఉపాధ్యాయ సిబ్బందిపాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన టాయిలెట్ క్లీనింగ్ క్యాన్లు



ఎమ్మార్సీ వద్ద టాయిలెట్ క్లీనర్ క్యాన్లను అన్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

బొండపల్లి: సర్కారు బడులను నాడు–నేడులో భాగంగా ప్రభుత్వం కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్న విషయం తెలిసిందే. నాడు- నేడుకు ఎంపికైన పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు రన్నింగ్ వాటర్ సదుపాయంతో ఆధునిక మరుగుదొడ్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణకు సిబ్బందిని నియమించింది. పాఠశాలల్లో టాయిలెట్ల క్లీనింగ్‌కు సంబంధించిన (క్లీనర్ లిక్విడ్)10 లీటర్ల క్యాన్లను ప్రభుత్వం అందిస్తోంది. స్థానిక ఎమ్మార్సీ(మండల వనరుల విద్యాకేంద్రం)కి 1,348 బాక్సుల టాయిలెట్ క్లీనర్ క్యాన్లతో కూడిన లారీ లోడ్ సోమవారం చేరుకుంది. వీటిని బొండపల్లి, గజపతినగరం, మెంటాడ మండలాల్లోని పాఠశాలలకు అందజేయనున్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మేళాలు

విజయనగరం టౌన్: అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన పథకం ఖాతాలు తెరిచేందుకు మెగా మేళాలు నిర్వహించనున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎ.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల లోపు బాలికల పేరిట ఖాతాలు తెరిచి పిల్లల బంగారు భవిష్యత్‌కు తోడ్పడాలని కోరారు.

రైస్ మిల్లుల్లో తనిఖీలు



మిల్లులో ధాన్యం మరపట్టడాన్ని పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ ధనం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి,పెద మానాపురంలోని రైస్ మిల్లుల్లో సీఎస్‌డీటీ ధనం సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం మరపట్టడాన్ని పరిశీలించారు. కోమటిపల్లి బాలాజీ రైస్ మిల్లులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులు మిల్లులకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వారికి ఇబ్బందులు పెట్టకుండా తీసుకోవాలని సూచించారు. మండలంలో 85 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగులు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

జీవన ప్రమాణా పత్రాలు సమర్పించండి

శృంగవరపుకోట: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లు అంతా ఈనెలాఖరులోగా తప్పనిసరిగా జీవన ప్రమాణా పత్రాలను (లైఫ్ సర్టిఫికెట్లు) స్థానిక ఉపఖజానా శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఎస్.కోట తాలూకా యూనిట్ కార్యదర్శి అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఈనెల 28వ తేదీలోగా జీవన ప్రమాణపత్రం నేరుగా ఖజానాశాఖ కార్యాలయంలో లేదా, హెర్బ్ పోర్టల్, ఆన్‌లైన్‌లో లేదా మీ–సేవ కేంద్రాల ద్వారా సమర్పించాలని పేర్కొన్నారు. స్థానిక ఉపఖజానాశాఖాధికారి రామారావు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు వీలుగా పెన్షనర్ల సౌలభ్యం కోసం రెండు బయోమెట్రిక్ యూనిట్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అదే సమయంలో ఇటీవల ప్రభుత్వం పెన్షనర్లు ఈకేవైసీ చేయించాలని, సీఎఫ్ఎంఎస్ నంబర్, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్‌తో అనుసంధానం చేయించుకోవాలన్న సూచనలను గుర్తించుకోవాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువులోగా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లు తమ జీవనప్రమాణ పత్రాలు ఇచ్చి, తమ వివరాలను అనుసంధానం చేయించుకోవాలని కోరారు.

కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు

దత్తిరాజేరు: స్థానిక పీహెచ్‌సీలో 11 మందికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు సోమవారం నిర్వహించామని వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు చేసి, మందులు అందజేశామని చెప్పారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా, ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమంలో భాగంగా నిత్యం గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీ

దత్తిరాజేరు: మండలంలోని గృహనిర్మాణశాఖలో ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీ అయిందని ఏఈ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పూసపాటిరేగ మండలం, సత్యారావు జామి మండలానికి బదిలీ అయ్యారని, వారి స్థానంలో మండలానికి బదిలీపై వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇంకా రావాల్సి ఉందని పేర్కొన్నారు.

రూ.9.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



దత్తిరాజేరులోని ప్రధాన వీధి నుంచి ఎస్సీ కాలనీకి నిర్మించిన సీసీ రోడ్డు

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని ప్రధాన వీధి నుంచి ఎస్సీ కాలనీకి రూ.9.5 లక్షలతో 200 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు ప్రధాన వీధి నుంచి ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు. దీంతో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల నుంచి రూ.9.5 లక్షలు సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మంజూరు చేశారు. ఈ నిధులతో ఈనెల 4,5వ తేదీల్లో రోడ్డు నిర్మాణం చేపట్టామని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి అప్పలనాయుడు సోమవారం తెలిపారు. మరో రూ. 9 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూరీసర్వేతో రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని తహసీల్దార్ అరుణ కుమారి అన్నారు. మండలంలోని రంగుపురం గ్రామంలో రైతులు సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో చేపట్టనున్న భూరీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. సమగ్ర భూరీసర్వే ఎప్పుడో వందేళ్ల క్రితం జరిగిందని, మళ్లీ ఇన్నాళ్లకు ప్రభుత్వం సర్వే చేయిస్తోందని, రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ సంజీవరావు

మెరకముడిదాం: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని చీపురుపల్లి సీఐ సంజీవరావు సూచించారు. బుధరాయవలస పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాట్లాడుతూ మెరకముడిదాం–గరివిడి, గర్భాం– గరివిడి రూట్లలో ఆటోలు నడుపుతున్న వారు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం తాను పలు మార్లు చూశానని, ఇది ప్రమాదకరమన్నారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడపవద్దన్నారు. లైసెన్సులు లేనివారికి ఆటోలు ఇస్తే సంబంధిత ఆటో యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటో స్టాండ్లలో ఇతర వాహనాలకు అడ్డు లేకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆటోలను నిలపాలని సూచించారు. ఎస్ఐ నవీన్‌పడాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 21లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి



సమీక్ష సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్‌లు, అధికారులు

గజపతినగరం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో పట్టాలు పొందిన వారితో పాటు, సొంత స్థలాలు ఉన్న వారికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను మార్చి 21 నాటికి పూర్తి చేసేలా అంతా కృషి చేయాలని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లతో ఇళ్ల నిర్మాణాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని, ఇంకా పనులు మొదలుపెట్టని వారితో త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, నిర్మాణాల దశలను ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ వలంటీర్లు అంతా లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లనిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, ప్రకృతివ్యవసాయ సిబ్బంది

బొండపల్లి: నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ఎంపీపీ చల్ల చలంనాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నవ ధాన్యాలను సాగు చేద్దాం– నేలతల్లికి జీవం పోద్దాం అనే నినాదంతో మండలంలోని బి.రాజేరు గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. నవ ధాన్యాల సాగుతో భూమి గుల్లబారి నీటిని బాగా పీల్చుకుంటుందని, రబీ పంటలకు నీటి ఎద్దడి లేకుండా కాపాడుతుందన్నారు. భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి సూక్ష్మజీవులు వృద్ధి చెంది సహజ పద్ధతిలో పంటకు పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. నవధాన్యాలు విత్తిన 30 రోజుల త్వరాత చేనును పశువులకు దాణాగా వేయడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందన్నారు. గజపతినగరం సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.రామ్మూర్తి, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'సఖి' గ్రూపు సభ్యుల మండల స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి గ్రూపులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల లోపు బాలికల్లో రక్తహీనత సమస్య, పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలని, బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలని చెప్పారు. స్మార్ట్ ఫోన్ ఉన్న బాలికలు, మహిళలతో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమానికి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, ఎంఈఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ భానోజీరావు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలు



పోతంపేటలో నిర్వహించిన పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం



కళ్లేపల్లిలో నిర్వహించిన పోటీల్లో పరుగు తీస్తున్న ఎద్దులు

లక్కవరపుకోట: మండలంలోని పోతంపేట, కళ్లేపల్లి గ్రామాల్లో పాపమ్మపేరంటాలు, సదాశివ స్వామి తీర్థాలు సందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎద్దులు, గుర్రాల పరుగు పోటీలు ఉత్కంఠగా సాగాయి. పోతంపేటలో గుర్రాలు, కళ్లేపల్లిలో ఎద్దుల పరుగు పందెం పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన గుర్రాలు, ఎద్దులకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. తీర్థాల సందర్భంగా గ్రామపెద్దలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

జగనన్న స్వచ్ఛసంకల్పానికి సహకరించండి



జగనన్న స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ సూర్యనారాయణ

వేపాడ: గ్రామాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం విజయవంతానికి ప్రజలంతా పూర్తి సహకారం అందించాలని ఎంపీడీఓ పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ కోరారు. మండలంలోని బానాది గ్రామంలో సర్పంచ్ కర్రి యశోద ఆధ్వర్యంలో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. చెత్తను వీధి కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో పారబోయకుండా రోజూ ఇంటి వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. అనంతరం అంతా జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేయించారు. వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.